క్లుప్తంగా

వైభవంగా శిరిడీ సాయి ఆలయ వార్షికోత్సవం



బాబాను పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

నల్లజర్ల: మండలంలోని అనంతపల్లిలో షిరిడి సాయి ఆలయ 27వ వార్షికోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలు ఉదయం కాకడ హారతితో మొదలై శేజ్ హారతితో మొదటిరోజు కార్యక్రమాలు ముగిసాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై బాబాను దర్శించుకున్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

ఎంపీ పురందేశ్వరి



యువకుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ పురందేశ్వరి తదితరులు

తాళ్లపూడి: మహా శివరాత్రి సందర్భంగా గోదావరిలో స్నానానికి దిగి మృతి చెందిన అనిశెట్టి పవన్ గణేష్, పడాల దుర్గా ప్రసాద్, పడాల దేవదత్త సాయి, గర్రే ఆకాష్, తిరుమలశెట్టి పవన్ కుమార్‌ల కుటుంబాలను ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీగా ఎన్నికైన సోము వీర్రాజు తదితరులు పరామర్శించారు. చేతికి అంది వచ్చిన కొడుకులు లేని లోటు తీర్చలేనిదని, వారిని పోగొట్టుకున్న కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎంపీ అన్నారు. శనివారం ఆమె ఒక్కో కుటుంబానికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోహన భారతి, కూటమి నేతలు పాల్గొన్నారు.

కుమారదేవం లిఫ్టు పరిశీలన

కొవ్వూరు: కుమారదేవం ఎత్తిపోతల పథకాన్ని శనివారం రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి పరిశీలించారు. ఈ లిఫ్టు పునరుద్ధరణకు రూ.5 కోట్లు మేరకు ఖర్చువుతుందని అధికారులు, రైతులు ఆమెకి వివరించారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి పథకం పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.

కార్మికుల శ్రమ దోపిడీ

నిడదవోలు: మున్సిపాలిటీలో కార్మికుల కొరతతో వారంతా శ్రమదోపిడీకి గురువుతున్నారని సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు అన్నారు. సీపీఎం ప్రజా చైతన్య యాత్రల్లో భాగంగా శనివారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీగా 28 వార్డులు ఉన్న నిడదవోలు పట్టణంలో ప్రస్తుతం 100 మంది లోపే పని చేస్తున్నారు. ఇందులో కొంతమందిని ఆఫీస్ పనులకు వినియోగిస్తున్నారని ఆయన విమర్శించారు. పదవీ విరమణ చేసిన శానిటరీ ఇన్స్‌పెక్టర్ స్థానంలో ఇంత వరకు మరొకరిని నియమించకపోవడం అధికారుల నిర్లక్ష్యంగా కనిపిస్తోందన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

కొవ్వూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.సుశీల తెలిపారు. ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారాయుడు) అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో మండలంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులు,పనుల పురోగతిపై సమీక్షించనున్నట్లు తెలిపారు. మండల పరిషత్ సభ్యులతో పాటు సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు విధిగా సమావేశానికి హాజరుకావాలని ఆమె కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనలు

చాగల్లు: మండలంలో బ్రాహ్మణగూడెంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీ రాజరాజేశ్వరి సరస్వతి అమ్మవార్ల ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా యాగశాల ప్రవేశం, పుణ్యాహవాచనం, పంచగవ్య నవగ్రహపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా అమ్మవార్ల జాతర

పెరవలి: మండలం అన్నవరప్పాడులో కొలువైన కట్టమ్మ, దండుగంగమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి నుంచి గరగలతో ఇంటింటా తిరిగి శనివారం ఉదయం పురవీధుల్లో భారీ ఊరేగింపు నిర్వహించారు. గరగ నృత్యాలు, కరీమ్‌నగర్, తీన్‌మార్ డప్పులు యువతను ఉర్రూతలూగించారు. యువకులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. పూలతో అమ్మవారి ప్రతి రూపాన్ని వేయటంతో ఆ చిత్రాన్ని చూసి మహిళలు పరవశించారు.

అలరించిన ఊరేగింపు

మండలంలోని మల్లేశ్వరంలో మహాలక్ష్మి అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఇంటి ఆడపడుచులు అందరూ ఈ ఉత్సవానికి పుట్టింటికి వచ్చి అమ్మవారి మొక్కులు చెల్లించుకున్నారు.

నూతన సాగు పద్ధతులు మేలు

- ఏరువాక ప్రధాన శాస్త్రవేత్తలు
- వేములూరులో అవగాహన సదస్సు



విద్యార్థులు తయారు చేసిన గ్రామ నమూనా పటం, చిత్రంలో శాస్త్రవేత్తలు, అధికారులు

కొవ్వూరు: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఆధునిక శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించుకుని నూతన సాగు విధానాలను అవలంబించాలని ఏరువాక ప్రధాన శాస్త్రవేత్తలు సీహెచ్‌వీ నరసింహరావు, ఎం.శ్రీనివాస్ సూచించారు. శనివారం వేములూరు గ్రామంలో ఎంపీయూపీ పాఠశాల వద్ద శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో గ్రామీణ భాగస్వామ్యంపై విశ్లేషణాత్మక సదస్సు నిర్వహించారు. రైతులు ఆచరిస్తున్న వివిధ వ్యవసాయ సాగు పద్ధతులు గురించి అడిగి తెలుసుకున్నారు. నూతన సాగు పద్ధతులు గురించి రైతులకు వివరించారు. రైతులు మోతాదుకి మించి రసాయనిక ఎరువులు వాడుతున్నట్లు క్షేత్ర పరిశీలనలో గుర్తించినట్లు విద్యార్థులు తెలిపారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా పశువుల పెంట, పచ్చిరొట్ట ఎరువులు వాడి చేనును సారవంతం చేసుకోవచ్చునని సూచించారు. పురుగు మందుల వాడకాన్ని తగ్గించుకుని కషాయాలు, ఘన, ద్రవ జీవామృతాలు వాడుకోవాలన్నారు. రంగవల్లిక ద్వారా గ్రామ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. గ్రామ నమూనా పటం తయారు చేసి పంటల విస్తీర్ణం, వాటి వివరాలు, పంటల వరుస క్రమం, గ్రామ అభివృద్ధి, పంట కాలం, గ్రామ ప్రభుత్వం కార్యాలయాల పని విధానాలు చిత్ర పటం ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఎ.గంగాధర్, గ్రామ వ్యవసాయ సహాయకులు ఆనంద్, అభ్యుదయ రైతు ఇమ్మణ్ణి హరిశ్చంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించండి

- డీపీఎం తాతారావు
- ప్రకృతి వ్యవసాయం–2025 ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై సదస్సు



కొవ్వూరులో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను సత్కరిస్తున్న అధికారులు

కొవ్వూరు: ప్రకృతి సాగు పద్ధతులను రైతులు అవలంబించాలని, రసాయన ఎరువులకు బదులు కషాయాలు వాడుకోవడం వల్ల భూమిని రక్షించుకోవచ్చునని ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం తాతారావు పేర్కొన్నారు. పట్టణంలో మండల వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద శనివారం నియోజకవర్గం పరిధిలోని రైతులకు, సెర్ప్ సిబ్బందికి ప్రకృతి వ్యవసాయం–2025 ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై సదస్సు నిర్వహించారు. ఈ కార్యాచరణ ముఖ్యోద్దేశం, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ప్రకృతి వ్యవసాయ విస్తరణలో డీఆర్‌డీఏ సెర్ప్‌ల పాత్ర, ఏపీఎంలు, సీసీ, వీవోలు, వీఏలు తీసుకోవలసిన చర్యలను ఆయన సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో సప్త సూత్రాల గురించి ఏడీపీఎం వలీ వివరించారు. పంటలలో వచ్చే తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవలసిన చర్యల గురించి శాస్త్రవేత్తలు డాక్టర్ నరసింహారావు, డాక్టర్ ఎం.శ్రీనివాసరావు వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో పండించిన పంట నాణ్యతగా ఉంటుందన్నారు. మండల స్థాయిలో గ్రామ సంఘం స్థాయిలో చిన్న, సన్నకారు మహిళా రైతులు ప్రతి ఒక్కరు ప్రకృతి వ్యవసాయం చేయాలని ఏపీవో మంగాయమ్మ సూచించారు. కిచెన్ గార్డెన్‌లకు ఇంట్లోనే సేంద్రీయ ఎరువులు తయారు చేసుకుని వేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ఏడీఏ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాన్ని ముందుకి తీసుకెళ్లేందుకు డీఆర్‌డీఏ, సెర్ప్‌లు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఉత్తమ రైతులను ఘనంగా సత్కరించారు. ఎంఏఓ ఎ.గంగాధర్, రైతులు, డీఆర్‌డీఏ, సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల సమావేశం

- పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన, గోపాలపురం నియోజకవర్గ కన్వీనర్ వనిత



పలు విభాగాల అధ్యక్షులతో జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ, గోపాలపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ తానేటి వనిత, రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి

నల్లజర్ల: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల ఆత్మీయ సమావేశం శనివారం రాత్రి నల్లజర్లలో మండల శాఖ అధ్యక్షుడు వెల్లంకి వెంకట సుబ్రమణ్యం అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, గోపాలపురం నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ మంత్రి తానేటి వనిత, రాజమహేంద్రవరం పార్లమెంటరీ పార్టీ కో ఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస రావు హాజరై ఆయా విభాగాల అధ్యక్షులను సభకు పరిచయం చేశారు. నియోజకవర్గ స్థాయిలో యువజన విభాగం నుంచి నక్కా పండు, కార్మిక విభాగం నుంచి మద్దూరి నాగేశ్వరావు, లీగల్ సెల్ నుంచి బోడిగడ్ల రాంబాబు, మున్సిపాలిటీ విభాగం నుంచి పిచ్చుకుల ప్రసాద్, చేనేత విభాగం నుంచి నందం ఉదయ బాలాజీ, సోషల్ మీడియా నుంచి గొర్రెల సాంబశివ నాయుడు ఉన్నారు. అలాగే మండల స్థాయి కమిటీలో యువజన విభాగానికి మేణ్ని యువరాజు, గ్రీవెన్స్ సెల్‌కు మల్లిడి శ్రీనివాసరెడ్డి, పంచాయతీ రాజ్ విభాగానికి చెల్లారి రామ శ్రీనివాస్, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు కనికెళ్ల కెనడీ, బీసీ సెల్‌కు చిన్ని నాగు యాదవ్, మహిళా విభాగానికి ఆరెళ్ల లక్ష్మి, ఎస్సీ సెల్‌కు అందుగుల వెంకటేశ్వరావులను అధ్యక్షులుగా పరిచయం చేశారు. అలాగే లీగల్ సెల్‌కు గోగుల మండ బాబ్జీ, రైతు విభాగానికి దొండపాటి ఫణికుమార్, మైనార్టీ సెల్‌కు సయ్యద్ మునాఫ్, వాణిజ్య విభాగానికి ఆదిత్య, ఆర్ఎంపీ విభాగానికి పాతకోకల శ్యామ్ సన్, ప్రచార కమిటీకి కనికెళ్ల సువర్ణరాజు, విద్యార్థి విభాగానికి జి.రాజు, ఉద్యోగులు,పెన్షనర్ల విభాగానికి పెనుమాక వెంకటరత్నం, సోషల్ మీడియాకు మైనం బాలాజీలను నాయకులు పరిచయం చేశారు. అలాగే బూత్ కమిటీల అధ్యక్షుడిగా కఠారి రాజ్‌కుమార్, కార్మిక విభాగానికి ములగాల శ్రీను, కల్చరల్ విభాగం నుంచి మద్దూరి విష్ణుమూర్తి ఉన్నారు. వీరందరికీ పార్టీ కండువాలు కప్పి అభినందించారు.

నైతిక విలువలు అలవరచుకోవాలి



యూనియన్ బ్యాంకు ఆర్ఎం శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

నల్లజర్ల: విద్యార్థులు చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలు అలవర్చుకోవాలని యూనియన్ బ్యాంకు రీజనల్ మేనేజరు ఎస్.శ్రీనివాస్ సూచించారు. దూబచర్ల ఎలైట్ కళాశాలలో డిగ్రీ మూడవ సంవత్సరం విద్యార్థులకు జూనియర్స్ ఫేర్‌వెల్ పార్టీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రీజనల్ మేనేజరు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలిచ్చారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఉన్నత చదువుల కోసం తమ బ్యాంకు రూ.40 లక్షల వరకు రుణ సహాయం అందిస్తుందన్నారు. విద్యార్థులు దీనిని వినియోగించుకోవాలన్నాను. కళాశాల యాజమాన్యం ఆర్ఎం శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించారు. ప్రిన్సిపాల్ కె.శ్రీలక్ష్మి, ఎలైట్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ దావులూరి ప్రభాకరావు, డైరక్టర్ సుదర్శనరావు, సుబ్బారావు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నల్లజర్ల: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈఓ–2 భగవతి పేర్కొన్నారు. నల్లజర్ల జెడ్పీ హైస్కూలు, శశిస్కూల్, దూబచర్ల, పోతవరం, అనంతపల్లి, జెడ్పీ హైస్కూళ్లలో కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 1080 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. ఒక్కో గదిలో 24 మంది విద్యార్థులు కూర్చుని పరీక్షలు రాసేలా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇందుకోసం 58 తరగతి గదులను కేటాయించారు. పరీక్షల నిర్వహణకు 78 మంది ఇన్విజిలేటర్లు, ఐదుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, ఐదుగురు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించినట్టు చెప్పారు. ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాలకు వెళ్లి వచ్చే విద్యార్థులు హాల్ టిక్కెట్ చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది.

బార్ కోడింగ్ ఓఎంఆర్‌తో పాటు..

విద్యార్థులకు బార్ కోడింగ్ ఉన్న ఓఎంఆర్ షీటుతో పాటు ప్రశ్నాపత్రంపై ప్రత్యేక సీరియల్ నంబరు ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రంలోకి వెళ్ళి రోల్ నంబరు ఆధారంగా కేటాయించిన గదిలో వరుస క్రమంలో కూర్చున్న విద్యార్థులకు అదే క్రమంలో ఓఎంఆర్ షీటుతో పాటు ప్రశ్నాపత్రం పంపిణీ చేస్తారన్నారు. ఒకవేళ వివరాల్లో తప్పులు ఉంటే ఇన్విజిలేటర్ దృష్టికి తీసుకెళ్ళాలన్నారు. ఎక్కడైనా లీకేజ్ సంఘటన జరిగితే అది ఏ కేంద్రంలో ఏ విద్యార్థికి ఇచ్చిన ప్రశ్నాపత్రం నుంచి అనే వివరాలు సీరియల్ నంబరు ఆధారంగా గుర్తించే ఆధునిక టెక్నాలజీ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చినట్టు చెప్పారు. పోతవరం పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

ఉండ్రాజవరంలో..

ఉండ్రాజవరం: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓలు సీహెచ్ సక్సేనా రాజు, డి.శారద జ్యోత్స్న శనివారం తెలిపారు. మండలంలో మొత్తం 8 ఉన్నత పాఠశాలలు, 3 ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, బాలురు, బాలికలు కలిపి మొత్తం 910 మంది ఈ పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. మండలంలో 5 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసామని, ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల–ఎ సెంటర్‌లో 200 మంది, ఉండ్రాజవరం–బి సెంటర్‌లో 180 మంది, వేలివెన్ను ఉన్నత పాఠశాలలో 180 మంది, వేలివెన్ను అన్నపూర్ణలో 150 మంది, వేలివెన్ను శశిలో 200 మంది ఈ పరీక్షలకు హాజరవుతారన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

నిడదవోలు : స్థానిక ఎల్ఎల్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. స్కూల్‌లో ఈ ఏడాది 21 మంది పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయడానికి సంసిద్ధమయ్యారు. విద్యార్థుల సౌకర్యార్థం విశ్రాంత సైన్స్ ఉపాధ్యాయురాలు మెంటే దయారాజగిరి ఆర్థిక సహకారంతో ఈ సామగ్రిని అందజేశారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు పేరు తీసుకురావాలని హెచ్ఎం కృష్ణకుమారి ఆకాంక్షించారు.

పరీక్షలకు ప్రశాంతంగా హాజరుకండి

- ఆందోళనకు గురికావద్దు
- ఎంఈఓ సత్యనారాయణ



నల్లజర్ల: ఈనెల 17వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు జరుగనున్నాయి. ప్రభుత్వ పరీక్షల విభాగం విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు, నియమావళిని హాల్ టిక్కెట్లపై ముద్రించినట్టు ఎంఇఓ వై.సత్యనారాయణ తెలిపారు. పరీక్షల సమయంలో పేపరు లీకైందని బయట వదంతులు వస్తుంటాయి. వాటిని విద్యార్థులు నమ్మవద్దన్నారు. ప్రశాంతంగా పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. మండల వ్యాప్తంగా 5 సెంటర్లు ఏర్పాటు చేశారని, 1080 మంది పరీక్షలకు హాజరవుతున్నట్టు చెప్పారు. ఉదయం 8.30కి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, 8.45 నుంచి 9.30 వరకు కేంద్రాల్లోకి అనుమతిస్తారన్నారు. హాల్ టిక్కెట్లు పొందిన విద్యార్థులు దానిపై ముద్రించిన తమ వివరాలను సరిచూసుకోవాలని, వాటిలో తప్పులు ఉంటే ముందుగానే వారి పాఠశాల హెచ్ఎం దృష్టికి తీసుకురావాలన్నారు.

కుల బహిష్కరణపై ఆర్డీవో విచారణ

చిడిపిలో ఇరు పక్షాల మధ్య కుదరని సఖ్యత



ఇరు పక్షాలతో మాట్లాడుతున్న ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ దేవకుమార్

కొవ్వూరు: చిడిపి గ్రామంలో రజకులను బహిష్కరించిన విషయంపై శనివారం ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ జి.దేవకుమార్, ఇతర అధికారులతో కలిసి గ్రామానికి వెళ్లి ఇరు పక్షాల పెద్దలతో చర్చించారు. గతంలో చోటుచేసుకున్న పరిణామాలు, రెండు కులాలు మాట్లాడుకోకపోవడానికి గల కారణాలను ఆరా తీశారు. గౌడ సంఘం చెరువు గట్టుపై ఏర్పాటు చేసిన సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహం, అమ్మవారి గుడి తొలగించాలని రజక సంఘం సభ్యులు కోరారు. అందుకు గౌడ సంఘం నాయకులు విముఖత చూపడంతో చర్చలు అసంతృప్తిగానే ముగిశాయి. ఒక దశలో అధికారుల మాట విని రాజీకి అంగీకరించారు. దీంతో రాతపూర్వకమైన ఒప్పందంపై రజక సంఘం నాయకులు సంతకాలు చేసినప్పటికీ, గౌడ సంఘ నాయకులు సంతకాలు చేయకుండా వెళ్లిపోవడంతో చర్చలు విఫలమయ్యాయి. తమ సామాజికవర్గం వారు పెద్దేవం గ్రామస్తుల ద్వారా వృత్తి పనులు చేయించుకుంటున్నామని గౌడ సంఘం నాయకులు వాపోయారు. ఒక సామాజిక వర్గం వారి వివాహాది శుభ కార్యాలు, ఇతర విందులకు ఇరు పక్షాలు హాజరు కావడం లేదు. ఇరు పక్షాల నుంచి ఐదు గురు చొప్పున ముఖ్యనాయకులతో ఆర్డీవో, డీఎస్పీలు అంతరంగికంగా సుదీర్ఘంగా చర్చలు జరిపారు. అయినప్పటికీ ఇరు పక్షాల మధ్య సఖ్యత కుదరలేదు. తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, గ్రామ సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు, రూరల్ సీఐ కె.విజయ్ బాబు, ఎస్సై కె.శ్రీహరిరావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి బి.శశాంక, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎంఎస్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

అంతుపట్టని వ్యాధితో వీధి కుక్కలు



అనారోగ్యంతో బాధపడుతున్న వీధి కుక్క

గోపాలపురం: మండలంలోని పలు గ్రామాల్లో అంతుపట్టని వ్యాధితో వీధికుక్కలు అవస్థలు పడుతున్నాయి. నెల రోజులుగా పలు కుక్కలపై తెల్లమచ్చలు, పుళ్లు పడిన శరీరంతో చూడటానికి జుగుప్సాకరంగా ఉంటున్నాయి. వాటిని చూసి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పశు సంవర్ధక శాఖ, పంచాయతీ అధికారులు మాత్రం వీటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. అధికారులు స్పందించి సత్వర చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

స్వచ్ఛ నిడదవోలు దిశగా అడుగులు

- మంత్రి కందుల దుర్గేష్



మున్సిపల్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి దుర్గేష్



వేగేశ్వరపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

నిడదవోలు : స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యులు కావాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్రా – స్వచ్ఛ దివస్‌లో దుర్గేష్ పాల్గొన్నారు. ప్రతి గ్రామం స్వచ్ఛతతో ఉండాలని, స్వర్ణాంధ్ర సాధనకు స్వచ్ఛ ఆంధ్రా బాసటగా నిలవాలన్నారు. అధికారులు, మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లతో ఆయన ఈ మేరకు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి సంత మార్కెట్ వరకు ర్యాలీ చేపట్టారు. స్వచ్ఛ నిడదవోలుకు అడుగులు వేద్దామని నినదించారు. అనంతరం సమిశ్రగూడెంలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన

తాళ్లపూడి: మండలంలోని గ్రామ పంచాయతీల వద్ద శనివారం స్వర్ణ ఆంధ్రా– స్వచ్ఛ ఆంధ్రాలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై గ్రామ సభలు పెట్టి అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అవగాహన ర్యాలీలను నిర్వహించారు. వేగేశ్వరపురంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఎల్‌పీవో అమ్మాజీ , ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉపయోగించడం ద్వారా అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. అన్నదేవరపేట పంచాయతీ వద్ద గజ్జరంలో సర్పంచ్ గండి రాంబాబు, పంచాయతీ కార్యదర్శి డీఎస్‌సీ శ్రీనివాస్, మలకపల్లిలో కార్యదర్శి కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం

దేవరపల్లి: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం, ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ విద్యార్థులు దేవరపల్లి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.రవికిశోర్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు ర్యాలి నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ప్రతి నెల మూడో శనివారం గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీలను శుభ్రపర్చడం వంటి కార్యక్రమాలు నిర్వహించి గ్రామ సభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు రవి కిశోర్ తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాలల విద్యార్థులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రవళి స్పిన్నింగ్ మిల్లులో..

పెరవలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్రలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని రవళి స్పిన్నింగ్ మిల్లు సంస్థ మేనేజర్ శాంతయ్య తెలిపారు. ఖండవల్లిలోని రవళి స్పిన్నింగ్ మిల్లులో ఈ కార్యక్రమాన్ని సిబ్బంది, కార్మికులు సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వామి, నటరాజన్, సురేష్, వెంకటస్వామి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆర్టీసీలో ప్లాస్టిక్ నిర్మూలనకు చర్యలు

కొవ్వూరు: స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ఆంధ్రా షుగర్స్ కంపెనీలో శనివారం సిబ్బంది, ఉద్యోగులతో స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా సంస్థ ప్రాంగణాన్ని శుభ్రం చేయించినట్లు కర్మాగారం మేనేజర్ ఈవీ కృష్ణారావు తెలిపారు. ఇందులో భాగంగా పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణాన్ని శనివారం శుభ్రం చేశారు. ప్లాస్టిక్ నివారణలో భాగంగా సిబ్బందికి క్లాత్ సంచులు కుట్టించి అందించినట్లు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. డిపో కార్యాలయంలో స్టీల్ వాటర్ బాటిళ్లను ఏర్పాటు చేశామన్నారు. ప్లాస్టిక్ వాడకం నియంత్రణకు సిబ్బంది సహకరించాలని కోరామన్నారు.

ఉండ్రాజవరంలో

ఉండ్రాజవరం: గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎంపీడీవో వీవీవీఎస్.రామారావు అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలో ఉండ్రాజవరంతో పాటు పలు గ్రామాల్లో శనివారం గ్రామ సభలు, మానవ హారాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఆంజనేయ శర్మ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించాలి

చాగల్లు: ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించి జూట్, వస్త్ర సంచులను వాడాలని ఎంపీడీవో ఆర్ శ్రీదేవి అన్నారు. చాగల్లు పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి అధ్యక్షతన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ ఎం.మెరికమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు స్వచ్ఛత వైపు అడుగులు వేసి పరిశుభ్ర గ్రామాలను తీర్చిదిద్దాలని కోరారు. సర్పంచ్ మనశ్శాంతి మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే మనందరి లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఆర్.శ్రావణ్ కుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురంలో..

గోపాలపురం: ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సర్పంచ్ యండపల్లి శేఖర్‌బాబు అన్నారు. మండలంలోని సగ్గొండ పంచాయతీ పరిధిలో శనివారం చిరువ్యాపారుల, పండ్ల దుకాణాదారులకు, ప్రజలకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పంచాయతీ కార్యదర్శి ఎం.అనురాధ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్‌పై అవగాహన కల్పించారు.

త్వరలోనే కమిటీల నియామకం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు



కొవ్వూరు: వైఎస్సార్ సీపీలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్త, నాయకుడికి తగిన గుర్తింపు ఇస్తామని, త్వరలోనే పార్టీ అన్నీ విభాగాలకు కమిటీల నియామక ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రకటించారు. మండల, పట్టణ కమిటీలతో అనుబంధ విభాగాల కమిటీల నియామకం పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను పార్టీ శ్రేణులు ఎండగట్టాలని సూచించారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకుని రావాలని సూచించారు.అవసరమైన ముఖ్య ప్రజా సమస్యలపై పార్టీ పిలుపు మేరకు పోరాటం సాగిద్దామన్నారు. కమిటీల నియామకంపై స్థానిక నాయకులతో చర్చించి ఏకాభిప్రాయంతోనే కమిటీలు ప్రకటిస్తున్నామన్నారు.